క్లుప్తంగా

ఉదయాన్నే పనులకు వెళ్లేలా చూడాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్

రొళ్ల: ఎండల తీవ్రత పెరగడంతో ఉపాధి కూలీలు ఉదయాన్నే పనులకు హాజరయ్యేలా చూడాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దినసరి కూలీ రూ.300 పెరిగిన విషయాన్ని కూలీలకు తెలియజేయాలన్నారు. ఎండలు అధికంగా ఉన్న కారణంగా ఉదయం 5:30 గంటల నుంచి 10:30 గంటల వరకూ పని చేసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు, నీరు, నీడ, వైద్యం తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఐదెకరాల్లోపు మెట్ట ప్రాంతాల్లో పండ్లతోటల పెంపకానికి ఆసక్తి గల రైతులను గుర్తించాలన్నారు. రైతులు కూడా ఎఫ్ఏలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబుళప్ప, సీఓలు, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

మడకశిరరూరల్: మండలంలోని జీవీపాళ్యం, గోవిందాపురం పంచాయతీల్లోని గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల సభ్యులు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరై ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలన్నారు.

టెస్టింగ్ క్యాంప్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పూలకుంట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంప్‌ను ఎంఈఓ గంగప్ప బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు దేశభక్తి, సేవాగుణం, ఇతరులకు సాయపడే గుణాలు కలిగి ఉండాలన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



వానవోలులో రాజీనామా చేసిన వలంటీర్లు

పరిగి/ రొద్దం/ గోరంట్ల: వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తమపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి విధులకు దూరం చేయడాన్ని నిరసిస్తూ పెనుకొండ నియోజకవర్గంలో పలువురు తమ పోస్టులకు రాజీనామా చేస్తున్నారు. బుధవారం పరిగి మండలం కొండిగెనహళ్లి, ఎర్రగుంట తదితర సచివాలయాల పరిధిలోని వలంటీర్లు రాజీనామా లేఖలను అధికారులకు అందజేశారు. రొద్దం, తదితర గ్రామాల వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. గోరంట్ల మండలం వానవోలు పంచాయతీలో 32 మంది, వానవోలు తండాలో ఏడుగురు, నార్సింపల్లిలో 14 మంది రాజీనామాలు చేశారు. అలాగే పెనుకొండ మండలం అడదాకులపల్లి, శెట్టిపల్లి, దుద్దేబండ, మునిమడుగు పంచాయతీల్లో వలంటీర్లు రాజీనామా చేశారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు



పావగడ: కోటగుడ్డ గ్రామం సమీపంలోని ప్రధాన రహదారిపై కేఎస్ఆర్టీసీ, ఓ ప్రైవేట్ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడ్ని తుమకూరుకు తరలించారు. ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణం నుంచి ఓ ప్రైవేట్ బస్సు చిత్రదుర్గం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు వేగాన్ని నియంత్రించక పోవడంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. మాజీ మంత్రి వెంకటరమణప్ప ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులను పరామర్శించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గిరీశ్ తెలిపారు.

పింఛన్ పంపిణీకి చంద్రగ్రహణం

- సచివాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు
- చంద్రబాబుపై మండిపడిన లబ్ధిదారులు

సాక్షి నెట్‌వర్క్: పింఛన్ల పంపిణీకి చంద్రగ్రహణం పట్టుకుందని లబ్ధిదారులు మండిపడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుచరుల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాల వద్ద పింఛన్ మొత్తం తీసుకునేందుకు లబ్ధిదారులు క్యూ కట్టారు. అయితే వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడ్డారు. పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభం కావడంతో లబ్ధిదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటడంతో లబ్ధిదారుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. చిలమత్తూరు సచివాలయం వద్ద ఓ వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోయాడు. ఎన్నికల కమిషన్ ఇప్పటికైనా వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



అమరాపురం సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



కొటిపి గ్రామసచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న పండుటాకులు



పెనుకొండ మండలం రాంపురంలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు



చిలమత్తూరు సచివాలయం వద్ద పింఛన్‌దారుల నిరీక్షణ



గోరంట్ల-5 సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు



అగళి మండలం మధూడి సచివాలయం వద్ద పింఛన్ కోసం వృద్ధుల అగచాట్లు

వలంటీర్ సేవలు కొనసాగించాలి



ప్రతి నెలా ఇంటి వద్దకు వచ్చి వలంటీర్ పింఛన్ ఇచ్చేవారు. కానీ చంద్రబాబు ఫిర్యాదులు చేసి మాకు ఇబ్బందులు పెడుతున్నాడు. మా గ్రామం నుంచి మూడు కిలోమీటర్లు కట్టె సహాయంతో నడుచుకుంటూ కేతగాని చెరువు సచివాలయానికి వచ్చాను. మండు టెండల్లో ఇదేం ఖర్మ మాకు. వలంటీర్ సేవలు కొనసాగించాలి.

– బోయ నరసింహప్ప, సుద్దగుంటపల్లి, సోమందేపల్లి మండలం

1వతేదీ తెల్లారకనే పింఛన్ చేతికందేది



ప్రతినెలా ఒకటో తేదీన రాగానే మా వార్డులో వలంటీర్ ఇంటికి వచ్చి నేత కాలు కదపకుండానే పింఛన్ డబ్బు చేతికి ఇచ్చేది. వలంటీర్ వ్యవస్థ బాగుండేది. ఇప్పుడు ఇట్లా ఎండపొద్దుల్లో ఆఫీసులా చుట్టూ తిప్పుతున్నారు. ఇప్పుడు ఇట్లా వచ్చి తిరిగితే ఎండకి పడిపోతాం. ఇంకెప్పుడు ఇస్తారో ఇక్కడ పింఛన్. చేతికిచ్చే పింఛన్ డబ్బు కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది.

–సాదిక్, దివ్యాంగుడు, హిందూపురం

పోయే కాలం వచ్చింది



వృద్ధాప్యంలో ఉన్న మాకు ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్లు వెతుక్కొంటూ వచ్చి పింఛన్ అందజేసే వాళ్లు. వలంటీర్లు పింఛన్ అందజేయకుండా చంద్రబాబు అడ్డుకున్నారు. చంద్రబాబుకు పోయే కాలం దగ్గరపడింది. మేము ఎక్కడుంటే అక్కడికే వచ్చి మా పింఛన్ డబ్బు ఇస్తున్న వలంటీర్లు అంటే చంద్రబాబు అంత కోపం ఎందుకో? ఇప్పుడు సచివాలయం వద్దకే వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది.

– సన్నరంగమ్మ, కరిదాసనపల్లిగోళ్ళహట్టి, అగళి మండలం

చంద్రబాబుకు బుద్ధి చెబుతాం



నాకు కళ్లు సరిగా కనిపించవు. జగనన్న సంక్షేమ పాలనలో ప్రతి నెల 1వ తేదీ ఉదయం వలంటీర్ తలుపుతట్టి పింఛన్ ఇచ్చారు. ఈ నెల నుంచి వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకుండా చంద్రబాబు నాయుడు అడ్డుకోవడం చాలా దారుణం. ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెబుతాం. రాజకీయాల కోసం తమపై కక్ష కట్టిన చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుంది. గతంలో టీడీపీ పాలనలో ప్రతి నెల ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటూ పింఛన్ తీసుకున్నాం.

– హనుమంతప్ప, ఆర్.అనంతపురం, మడకశిర మండలం

వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయం

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లోని బూత్ కమిటీ సభ్యులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులకు ప్రచార సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ కమిటీ సభ్యులు ఆయా బూత్‌లలో ఉన్న ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చేలా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ల కాలంలో అందించిన సంక్షేమ ఫలాలను వివరించాలన్నారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. ప్రతి సభ్యుడు ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులకు ప్రచార సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హనుమంతరాయ, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రచార సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

ప్రచార సామగ్రి పంపిణీ

మడకశిరరూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్రయాదవ్, తిమ్మప్ప తెలిపారు. బుధవారం జీవీపాళ్యం, గోవిందాపురం పంచాయతీలకు ఇంటింటా ఎన్నికల సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నాయని నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కోరారు. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకుందామని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి సీఎంకు మడకశిర నుంచి కానుకగా ఇద్దామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల, రాష్ట్ర బీసీ సెల్ సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, వివిధ కమిటీల సభ్యులు జయరామ్, కృష్ణారెడ్డి, నరేష్ రెడ్డి, నాగభూషణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, హనుమంతరాయప్ప, రుద్రప్ప, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పాపం చంద్రబాబును ఊరికే వదలదు

- ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

చిలమత్తూరు: పింఛన్ పాపం చంద్రబాబును ఊరికే వదలదు అని వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. ఆమె బుధవారం సంజీవరాయునిపల్లి, పాతచామలపల్లి, కొత్తచామలపల్లి, ఆదేపల్లి తాండా, చిన్నన్నపల్లి, లాలేపల్లి గ్రామాల్లో నియోజకవర్గ నేత వేణురెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని గురించి వివరించారు.అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలించాలన్నారు. చంద్రబాబు రాక్షస పాలన మనకొద్దని ప్రజలకు వివరించి మరోమారు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల ద్వారా ఒకటో తారీఖునే ఇంటికే వెళ్లి పింఛన్ అందించారని, చంద్రబాబు చేసిన పనికి అవ్వాతాతలకు లేని కష్టాలు తెచ్చిపెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాల ద్వారా మండుటెండల్లో నించోని పింఛన్ తీసుకొనే దుస్థితి వారికి రావడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడే ఇలా ఉంటే టీడీపీ అధికారంలోకి పొరపాటుగా వస్తే ప్రజలకు కష్టాలు పెడతారన్నారు. ప్రజలు ఆలోచించుకొని, మంచి జరిగింటేనే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, సర్పంచ్‌లు తిరుమలేష్, శంకర్‌రెడ్డి,లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీలు రాఘవేంద్ర రెడ్డి, ఆదినారాయణ, సింగిల్‌విండో చైర్మన్లు హనుమంతరెడ్డి, దివాకర్‌రెడ్డి, సీనియర్‌నేత రామకృష్ణారెడ్డి, మండల మాజీ కన్వీనర్లు సదాశివరెడ్డి, మద్దిపి లక్ష్మినారాయణ, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మిరెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, గిరిధర్‌రాజు, లక్ష్మినారాయణరెడ్డి, నాగభూషణరెడ్డి, అయూబ్, షాకీర్, నయిముల్లా, హరి, అన్సర్ అహమ్మద్, హిందూపురం నాయకులు శ్రీరామరెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, దిలీప్, తమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాతచామలపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, వేణురెడ్డి

ఘనంగా రవిశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మడకశిర: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వాగేష్, రంగేగౌడ్, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, అగళి జేసీఎస్ కన్వీనర్ మహేంద్ర, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, ఎంపీటీసీ హనుమంతరాయప్ప, కౌన్సిలర్లు రమేష్, నాగేంద్ర, అమరాపురం వైస్ ఎంపీపీ రంజిత్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, వాల్మీకి సంఘం నాయకులు సురంగల శ్రీనివాస్, నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వారు కేక్ కట్ చేసి రవిశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

మడకశిర: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో బుధవారం నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 500 మంది సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఓ గౌరీ శంకర్‌రావు, ఏఆర్ఓ వెంకటేశ్, మాస్టర్ ట్రైనర్లు ఈవీఎంల పనితీరుపై వివరించారు. పీఓలు, ఏపీఓలకు ఎన్నికల విధులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు.పోలింగ్ రోజు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ దాసరిమేరి, డీటీ బాలాంజనేయులు,ఎన్నికల విభాగం డీటీ మారుతి ప్రసాద్,ఎంఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపకరణాలు

మడకశిరరూరల్: అర్హత ఉన్న దివ్యాంగులందరికీ ఉపకరణాలు అందజేస్తామని ఎంపీడీఓ దాసరి మేరీ తెలిపారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం, రొద్దం మండలాలకు చెందిన దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆట పాటలతో పాటు చదువులో రాణించాలన్నారు. అనంతరం వైద్యులు 360 మంది దివ్యాంగులకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉపకరణాలకు అర్హత ఉన్న వారిని గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా ఐఈడీ కో–ఆర్డినేటర్ ఆనంద్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో శ్రీచరణ్‌రెడ్డి

పరిగి: కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంత్రి ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సోమశేఖరరెడ్డి, బాలాజీ, లక్ష్మీరెడ్డి, రవి, తిమ్మారెడ్డి, మునిస్వామి, రమాకాంత్‌రెడ్డి, ముత్యాలప్ప, సుబ్రహ్మణ్యం, నాగరాజు, రాజన్న, ఉమాశంకర్, సంజీవప్ప, మూర్తి తదితరులు ఉన్నారు.

నేడు కల్లూరులో ప్రచారం

లేపాక్షి: కల్లూరు పంచాయతీలో గురువారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు టీఎన్.దీపిక, బోయ శాంతమ్మలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ నారాయణస్వామి బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

మొరసలపల్లిలో టీడీపీకి షాక్

- టీడీపీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

హిందూపురం: చిలమత్తూరు మండలం మొరసలపల్లిలో టీడీపీకి షాక్ తగిలింది. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న 20 కుటుంబాలు టీడీపీని వీడి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి వేణురెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ నుంచి ఎంపీటీసీగా పోటీచేసిన గొల్ల సోమశేఖర్, బీసీ సెల్ కార్యదర్శి ఈశ్వరప్ప, రామకృష్ణ, ఈశ్వరప్ప, చంద్ర, నారాయణస్వామి, హరిప్రసాద్ , నారాయణ స్వామి శ్రీనివాసులు, దేవరాజు, ఎం ఎస్ సురేష్, ఎం నారాయణస్వామి, చాకలి రామంజినేయులు, రామాంజనేయులు, వెంకటేష్, వాల్మీకి రామాంజి తదితర 20 కుటుంబాలు ఉన్నాయి. ఈసందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ హిందూపురంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ నియోజకవర్గ ప్రజలనే గాక ఆ పార్టీ కార్యకర్తలను కూడా గాలికి వదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తుందన్నారు. ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి హిందూపురం ఎమ్మెల్యేగా టీఎన్.దీపిక, ఎంపీగా బోయ శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. అనంతరం పార్టీలో చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ టీడీపీలో ఎన్నికలు వస్తే తప్ప పార్టీ కార్యకర్తలు గుర్తుకు రాని పరిస్థితి ఉందన్నారు. జగనన్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ ఈరప్ప, మాజీ ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, నాయకులు శేఖర్, త్యాగరాజు, హనుమంత రెడ్డి, గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి

పింఛన్ల పంపిణీ పరిశీలన

రొళ్ల: మండల కేంద్రం సచివాలయం–1, రత్నగిరి, దొడ్డేరి సచివాలయాల ఆవరణలో బుధవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు ఒంటరి మహిళలకు అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 11 సచివాలయాల పరిధిలోని 5,718 మందికి గాను రూ.1,70,62,500 మంజూరైనట్లు తెలిపారు. సచివాలయం సిబ్బంది పింఛన్ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా సొమ్ము అందజేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

5 నుంచి 12 వరకు వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 5 నుంచి 12 వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. మండి మర్చెంట్స్, హమాలీ అసోసియేషన్ వారు మార్కెట్‌కు రారన్నారు. ఎండు మిర్చి, చింతపండు వారం రోజుల పాటు మార్కెట్‌కు తీసుకు రావద్దని కార్యదర్శి రైతులను కోరారు.

నేడు పరిగిలో ఇఫ్తార్ విందు

పరిగి: మంత్రి ఉషశ్రీచరణ్ నేతృత్వంలో ముస్లింలకు పరిగిలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు కొడిగెనహళ్లిలోని రఫీక్‌ఖాన్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తారన్నారు. సాయంత్రం 6 గంటలకు పరిగి జామియా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి.. అనంతరం వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు.

కేబుల్ చోరీ

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ఎస్ గుండ్లు శివారులోని పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు 20 మోటర్లకు ఏర్పాటు చేసిన 250 మీటర్ల కేబుల్‌ను మంగళవారం రాత్రి చోరీ చేశారు. ఎస్ఎస్ గుండ్లు గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప, వీరారెడ్డి, రాజప్ప, రామకృష్ణ రైతుల పొలాల్లో కేబుల్ చోరీ జరిగినట్లు గుర్తించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దొంగలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ విషయంపై ఎస్ఐ మునిప్రతాప్ మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో నిఘా పెట్టి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు.

అంగనవాడీ పిల్లలకు దుస్తుల అందజేత

పరిగి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల మూడు అంగనవాడీ కేంద్రాల చిన్నారులకు దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు కుమార్తె దివ్య జ్ఞాపకార్థం ఏటా ఎస్సీ కాలనీ అంగనవాడీ కేంద్రాల్లోని దాదాపు 150 మంది చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం చిన్నారులకు దుస్తులతో పాటు వారి తల్లిదండ్రులకు భోజన వసతిని కల్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనుకొండ: పట్టణంలోని ఓ లాడ్జిలో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ యుగంధర్, ఎస్ఐ రాజేష్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 9,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

హిందూపురం అర్బన్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సభలు, సమావేశాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ బుధవారం తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచారాలు, జాతరలు, బహిరంగ సభలు, సమావేశాలకు నేరుగా గాని, ఆన్‌లైన్‌లో కాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అనధికార మాంసం దుకాణాల తొలగింపు

పావగడ: అనధికారంగా నిర్వహిస్తున్న మాంసం దుకాణాలపై మున్సిపల్ అధికారులు కన్నెర్ర చేశారు. బుధవారం పట్టణంలోని శిరా రోడ్డులో ఎటువంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకున్న అక్రమ మాంసం దుకాణాన్ని స్థానిక మున్సిపల్ అధికారులు జేసీబీతో తొలగించారు. మాంసం దుకాణ యజమాని శవర్ మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు.